ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 15.06.2024 సమయం 1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్ళపై ఏర్పాటయిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ నిస్పక్షపాతంగా విచారించడం లేదని మాజీ ముఖ్యమంత్రి K. చంద్రశేఖర్ రావు ఆరోపించారు.

2. యుద్ధంలో విజయం సాధించేందుకు సైబర్ సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోవాలని ఫ్లైయింగ్ అధికారులను ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి కోరారు.

3. రాష్ట్రంలో 20 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

4. దేశంలోనే మొదటిసారి రాష్ట్రంలో వంద మంది యువతులకు రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి చలనచిత్ర సంబంధిత నైపుణ్యాల శిక్షణ అందించింది.

**న్యాయ విచారణ:**

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్ళపై ఏర్పాటయిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ L. నరసింహారెడ్డి విచారణ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలగాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు విజ్ఞప్తి చేశారు. కమీషన్ తమ విచారణలో నిస్పక్షపాతంగా వ్యవహరించటం లేదని ఆరోపిస్తూ జస్టిస్ నరసింహారెడ్డిని ఎంక్వయిరీ కమిషన్ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని కోరారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పంద నిర్ణయాలపై వివరణ ఇవ్వాలంటూ ఈ నెల 11న చంద్రశేఖర్ రావుకి జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ నోటీసులు జారీ చేసింది. వివరణకోసం ఈ రోజు వరకు గడువు ఇచ్చిన నేపథ్యంలో చంద్రశేఖరరావు కమీషన్

కు రాసిన 12 పేజాలు లేఖలో ఈ విషయం చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా విషయంలో గణనీయమైన మార్పుల్ని చూపించామని ఆయన లేఖలో పేర్కొన్నారు. కానీ, రాజకీయ కక్షతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమను అప్రతిష్టపాలు చేయాలనే దురుద్దేశంతో కమిటీని ఏర్పాటు చేసిందని ఆరోపించారు. విచారణ పూర్తి కాకముందే , తీర్పు ప్రకటిస్తున్నారని, గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక ఇవ్వడమే లక్ష్యం అన్నట్లుగా జస్టిస్ నరసింహారెడ్డి మాట్లాడుతున్నారని ఆరోపించారు. నిష్పాక్షికంగా విచారణ జరగటం లేదని ఆరోపిస్తూ, అలాంటి విచారణకు హాజరైనా ప్రయోజనం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

-------MSL

**GRADUCATION CEREMONY:**

యుద్ధంలో విజయం సాధించేందుకు సైబర్ సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియెగించుకోవాలని కొత్తగా నియమితులైన ఫ్లైయింగ్ ఆఫీసర్స్ ని ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి కోరారు. హైదరాబాద్ సమీపంలోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఈ ఉదయం నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ కు ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి ముఖ్య అతిథిగా హాజరై , క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే కాలంలో ఆధునిక యుద్ధాల్లో భౌతిక దాడులు కనుమరుగై సైబర్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన ఆఫీసర్స్ అకాడమీలో నేర్పిన విలువలను అలవర్చుకోవాలని , సంస్థ ఉన్నతిని సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు ఈ పరేడ్‌లో పిలాటస్ పీసీ-7 ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్‌డోర్నియర్, హాక్, కిరణ్, చేతక్, సుఖోయ్-30, సారంగ్ హెలికాప్టర్లతో క్యాడెట్లు చేపట్టిన సైనిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కాగా , ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో 200 మందికి పైగా క్యాడెట్లకు రాష్ట్రపతి ఆదేశాలతో దళంలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఫ్లైట్ క్యాడట్లకు , భారత్ నౌకాదళం , తీరప్రాంత రక్షణ దళం అధికారులకు , శిక్షణ పూర్తి చేసుకున్న మిత్ర దేశాలకి చెందిన అధికారులకు వీఆర్ చౌధరి వింగ్స్ ప్రధానం చేశారు.

MSL

**ప్రసూతి మరణాలు**

రాష్ట్రంలో గతేడాది ప్రసూతి మరణాలు తగ్గినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ తెలియజేసింది. 2022-23 సంవత్సరంలో 340 మరణాలు నమోదు కాగా , 2023-24 సంవత్సరంలో 260కి తగ్గినట్లు పేర్కొంది. దేశంలో అతి తక్కువ ప్రసూతి మరణాలు సంభవిస్తున్న రాష్ట్రాల్లో ప్రస్తుతం తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ప్రసూతి మరణాల్లో అత్యధిక శాతం ప్రసవించిన వారంలోపే జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. గుండె సమస్యలు , ఊబకాయం, రక్తస్రావం, అబార్షన్ వంటివి ఈ మరణాలకు ముఖ్య కారణాలుగా ఉన్నాయి.

Desk

స్కూల్స్ యశస్వినీరెడ్డి

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన రోజే పిల్లలకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఈరోజు పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండలం హరిపిరాల జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఆచార్య జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పీటీసీ, జనగాం

**స్కానింగ్ సెంటర్స్**

స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ హెచ్చరించారు. ఈ విషయమై కలెక్టరేట్

లో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్లో ఫారం- ఎఫ్ లను తనిఖీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. యువతకు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం గురించి అవగాహన కల్పించి , బృణ హత్యలు నివారించానన్నారు. బాలికల నిష్పత్తి పెరిగేలా పోలీసు కళాజాత , స్వయం సహాయక సంఘాలు, పౌరసంబంధాల శాఖ సాంస్కృతిక కళాకారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

పీటీసీ, మహబూబాబాద్

కలెక్టర్ల బదిలీ

రాష్ట్రంలో 20 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హన్మకొండ కలెక్టర్ గా ప్రావీణ్య, మహబుబ్ నగర్ విజేయంద్ర, వికారాబాద్ ప్రతీక్ జైన్, నల్గొండ నారాయణరెడ్డి, వనపర్తి ఆదర్శ్ సురభి , సూర్యాపేట్ తేజస్ నంద్ లాల్ , ములుగు దివాకర, ఖమ్మం కలెక్టర్ గా మజమిల్ ఖాన్, భూపాలపల్లి రాహుల్ శర్మ, కొత్తగూడెం జితేశ్ వి. పాటిల్, నాగర్ కర్నూల్ కలెక్టర్ గా సంతోష్ , జగిత్యాల సత్యప్రసాద్, కరీంనగర్ అనురాగ్ జయంతి , నారాయణ పేట సిక్తా పట్నాయక్ నియమితులయ్యారు. పెద్దపల్లి కోయ శ్రీహర్ష , సిరిసిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ నియమితులయ్యారు. మరికొన్ని జిల్లాల్లో కూడా బదిలీలయ్యాయి.

**కామారెడ్డి రైతులు**

రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా పాడి పశువులు , చేపల పెంపకం చేపట్టేలా ఐకెపి అధికారులు ప్రోత్సహించాలని , కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాటిల్

మాట్లాడుతూ... రైతులు చిన్న చెరువులాంటి నిర్మాణం చేసి , తక్కువ పెట్టుబడితో చేపలు పెంపకం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని సూచించారు.

పీటీసీ, కామారెడ్డి

**సీనియర్ సిటిజన్స్**

వృద్ధులపై జరుగుతున్న వేధింపులను ప్రతి ఒక్కరూ ఖండించాలని రాష్ట్ర సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ రోజు ప్రపంచ వయోధికుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ సభ్యులు గన్ పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించి, ర్యాలీ చేపట్టారు.

డెస్క్

**మంత్రి కోమటిరెడ్డి**

దేశంలోనే మొదటిసారి మన రాష్ట్రంలో వంద మంది యువతులకు ఒకేసారి సినిమాటోగ్రఫీ సంబంధిత నైపుణ్యాల శిక్షణ ఇచ్చామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు సాగిన 45 రోజుల కోర్సులో థియరీ తో పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించామని పేర్కొన్నారు. నల్గొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల , తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల ఎస్సీ , ఎస్టీ విద్యార్థినులకు సినిమాటోగ్రఫీ నైపుణ్య శిక్షణ కోర్సులు నిర్వహించిన నీలగిరి నిపుణా ప్రోగ్రాం సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. యాంకరింగ్ విద్యార్థులు జయశ్రీ , శ్రుతి ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, సినిమాటోగ్రఫీ విద్యార్థులు కెమెరా కవరేజీ నిర్వహించారు.

పీటీసీ, నల్గొండ

**సిరిసిల్ల సదరం**

సిరిసిల్ల పట్టణంలో ఈనెల 26, 27 తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ తెలిపారు. 26న వినికిడి , ఆర్థోపెడిక్, 27న మానసిక, కంటిచూపు వైద్యులు పరీక్షలు చేస్తారని చెప్పారు. జిల్లాలోని దివ్యాంగులు మీ సేవా కేంద్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకుని ఆధార్ కార్డు , మెడికల్ సర్టిఫికెట్లు, ఫొటోలతో రావాలని ఆయన సూచించారు.

పీటీసీ, సిరిసిల్ల

**WEATHER UPDATE**

నైరుతి రుతుపవనాల విస్తరణతో ఈరోజు, రేపు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీస్తూ ఉరుములు , మెరుపులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో నిజమాబాద్, నల్లగొండ, సూర్యపేట్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.
PN

**అసిఫాబాద్ వర్షాభావ పరిస్థితులు**

మరోవైపు అసిఫాబాద్ జిల్లాలోని 15 మండలాలు ఉండగా , 13 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు కావడంతో ఖరీఫ్ లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎక్కువగా వర్షాధారిత పంటలు పండిస్తారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించాయని అధికారులు చెబుతున్నప్పటికీ జిల్లాలో వర్షభావ పరిస్థితులు నెలకొనడంతో, రైతులు ఆందోళన చెందుతున్నారు.

పీటీసీ, అసిఫాబాద్

**నిర్మల్ వానకాలం**

వానకాలం సీజన్లో రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని నిర్మల్ జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ సూచించారు. మండలాల వ్యవసాయ అధికారులు , ఏఈవోలతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... నిషేధిత విత్తనాలను, పురుగుల మందులను అమ్మకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనన్నారు.

పీటీసీ, నిర్మల్

**లాయర్ల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం**

అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ లో శిక్షణ పొందడానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన న్యాయ విద్యా పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అర్హులైన, జిల్లా ఎస్సీడీవో వినోద్ కుమార్ తెలిపారు. ఎంపికైన వారికి నెలకు 3 వేల స్టయిఫండ్ , పుస్తకాలు, ఫర్నీచర్ కొనుగోలు కోసం 50 వేల రూపాయిలు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ రోజు సాయంత్రం లోపు ఎస్సీడీ వో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

పీటీసీ, సిరిసిల్ల

**విద్యుత్ ప్రజావాణి**

జనగాం జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు టి.జి.ఎన్.పి.డి.సి.ఎల్ జనగాం జిల్లా ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు. సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలతో జిల్లాలోని ఏఈ , ఈఆర్ఓ , ఏడిఈ, డిఈ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, ఎస్.ఈ కార్యాలయంలో

మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 17న బక్రీద్ సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో , ఆ తర్వాతి సోమవారం నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

పీటీసీ, జనగాం

**UGC NET**

ఈ నెల 18న జరిగే యూజీసీ నెట్-2024 అడ్మిట్ కార్డులను ఎన్టీఏ విడుదల చేసింది. ugcnet.nta.ac.in వెబ్ సైట్ నుంచి అడ్మిట్ కార్డులు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించింది. కాగా, అడ్మిట్ కార్డులకు సంబంధించి ఏదైనా సమస్య ఎదురైతే 011-40759000 సంప్రదించాలని అధికారులు సూచించారు.

Desk

**ధరణి వరంగల్**

ధరణి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నామని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. మండల తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను స్కానింగ్ చేసేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ధరణి దరఖాస్తులను తిరస్కరించిన సందర్భంలో దానికి స్పష్టమైన కారణాలు , సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు అప్ లోడ్ చేయాలని ఆమె చెప్పారు.

పీటీసీ, వరంగల్